సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 25 । జూన్ । 2025



సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్

సిద్దవటం రేంజి పరిధి గొల్లపల్లె సెక్షన్‌లోని సమస్యాత్మక ప్రదేశాల్లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం కూంబింగ్ నిర్వహించారు. -8లో



వినాయక విగ్రహం అపహరణ

పెనగలూరు మండలంలోని అతిగారిపల్లిలో పురాతన కాలం నాటి వినాయక విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.232	రూ.290
రెండోరకం	రూ.150	రూ.228



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1382 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీజీ	450	555
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 977.480 కిలోలు

న్యూస్‌రీల్

25న రాజ్యాంగ హత్యా దినం

రాయచోటి: భారత ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 25న రాజ్యాంగ హత్యా దినంగా అన్నమయ్య జిల్లాలో జరుపుకొంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించిన నేపథ్యంలో.. భారత ప్రభుత్వం జూన్ 25న రాజ్యాంగ హత్య దినంగా ప్రకటించిందన్నారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అయిన సందర్భంగా రాజ్యాంగం, దాని విలువలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన వైద్యాధికారులు



డీఎంహెచ్‌ఓకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైద్యాధికారులు

రాయచోటి జగదాంబసెంటర్: అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ లక్ష్మీనరసయ్యను వైద్య శాఖకు చెందిన పలువురు వైద్యాధికారులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాయచోటిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా డీపీఎంఓ రియాజ్‌బేగ్, జిల్లా ఏపీ ఎంసీఏ అధ్యక్షులు సాల్మోహన్, జిల్లా జనరల్ సెక్రటరీ తలారి భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ భరత్, ప్రవీణ, రమ్య, ఇంద్రజ.. డీఎంహెచ్‌ఓకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మనందరం ప్రజల ఆరోగ్యం కోసం పని చేయాల్సిన బాధ్యత ఉందని వారితో అన్నారు. ప్రతి ఒక్కరూ సహకారం అందించి వైద్యశాఖలో జిల్లాకు మంచి పేరు తీసుకొద్దామని ఆయన తెలియజేశారు.

నేటి నుంచి మదనపల్లికి గుంటూరు ఎక్స్‌ప్రెస్

కలికిరి: తిరుపతి–గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం నుంచి తిరుపతి నుంచి మదనపల్లి వరకు నడువనుంది. మదనపల్లి నుంచి తిరుపతి వరకు అన్ రిజర్వుడు స్పెషల్ ట్రైన్‌గా నడుపనున్నారు. తిరుపతి నుంచి యథావిధిగా ఎక్స్‌ప్రెస్‌గా నడువనుంది. దీంతో మదనపల్లి నుంచి తిరుపతి వరకు రైలు ప్రయాణికులకు సూపర్ ఫాస్ట్ చార్జీలు అమలులోకి రానున్నాయి. అన్ రిజర్వుడు సూపర్ ఫాస్ట్ (07261) ఉదయం 5.15 గంటలకు తిరుపతిలో బయల్దేరి పాకాలకు 5.55 గంటలకు, పీలేరు 6.25కి, కలికిరి 6.40కి, మదనపల్లికి 8.15 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 07261 రైలు మదనపల్లిలో సాయంత్రం 3 గంటలకు బయల్దేరి 3.30కి కలికిరి, పీలేరు 3.45కి, పాకాల 4.50కి, తిరుపతికి సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి యథావిధిగా గుంటూరు ఎక్స్‌ప్రెస్(17262)గా సాయంత్రం 7.25 గంటలకు బయల్దేరి రేణిగుంట, రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు, కడప జంక్షన్, కమలాపురం, యర్రగుంట్ల జంక్షన్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కోవెలకుంట్ల, బనగానపల్లి, నంద్యాల జంక్షన్, గిద్దలూరు, కంభం, మార్కాపురం రోడ్, దొనకొండ, వినుకొండ, నరసరావుపేట, మీదుగా ఉదయం 7.20 గంటలకు గుంటూరుకు చేరుకుంటుంది. ఈ రైలు సదుపాయంతో మదనపల్లి, కలికిరి, పీలేరు, పాకాల ప్రాంత వాసులకు కడప, నంద్యాల, మార్కాపురం రోడ్, నరసారావుపేట తదితర ప్రాంతాలకు రైలు ప్రయాణం అందుబాటులోకి వచ్చినట్లయింది.

'ఉర్దూ' నేర్చుకోవడానికి దోహదం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాయచోటి టౌన్: ఉర్దూ భాషను సులభంగా నేర్చుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో మంగళవారం 'ఉర్దూ భాషను సులభంగా నేర్చుకోండిలా' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని అజీజియా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో రచయిత అబ్దుల్ వహీద్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా, త్వరగా నేర్చుకునే విధంగా రూపొందించారని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో రెండవ భాషగా ఉర్దూను ఎంచుకున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ ఉర్దూ భాష నేర్చుకోవడానికి ఇలాంటి పుస్తకాలు ఎంతో అవసరం ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్ షేక్ మహమ్మద్ హషీం, పాలం రాజు, గోపాల్, బాబా ఫక్రుద్దీన్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వంధనంలో కోత.. తల్లులకు వెత

- అర్హులకూ అందని ద్రాక్షలా పథకం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- అధికారుల నుంచి అందని సహకారం
- పైసలు ఇవ్వందే పనులు కావడం లేదంటున్న బాధితులు



రాయచోటి: సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే.. అంత మందికి రూ.15 వేల చొప్పున జమ చేస్తామని ఎన్నికల ముందు కూటమి పెద్దలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 15 వేలు అంటూ ఊదరగొట్టారు. ఇద్దరు ఉంటే రూ.30 వేలు, ముగ్గురు ఉంటే రూ.45 వేలు ఇస్తామంటూ చెప్పుకొచ్చారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఎట్టకేలకు తల్లికి వందనం పథకం సొమ్ములు తల్లుల ఖాతాల్లో జమ అవ్వడం మొదలయ్యాయి. హామీ ఇచ్చినట్లుగా రూ.15 వేలు కాకుండా రూ.13 వేలే జమ చేశారు.

కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందనే కారణంతో..

జిల్లాలో కూటమి సర్కారు అట్టహాసంగా అమలు చేసిన తల్లికి వందనం పథకంలో చిన్న చిన్న తప్పిదాలతో చాలా మంది అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సాయం జమ కాక తల్లులు సచివాలయాల చుట్టూ పరుగులు పెడుతున్నారు. సచివాలయాలు, బ్యాంకులు, కరెంట్ ఆఫీసులు, రెవెన్యూ కార్యాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం డబ్బు జమ కానట్లు తెలియడంతో చాలా మంది ఉసూరుమంటూ వెనుతిరిగి వెళుతున్నారు. కొందరికి విద్యుత్ వినియోగం ఎక్కువ అనే కారణంతో పథకం సొమ్ములు జమ కాలేదని తెలియడంతో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు క్యూ కడుతున్నారు. కొందరికి ఎలాంటి భూమి లేకపోయినా 10, 15 ఎకరాలు భూములు ఉన్నాయన్న సమాచారంతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం పరిపాటిగా మారింది. ఆధార్ కార్డు, రేషన్ కార్డులలో పేర్లు తప్పులు దొర్లిన వాటిని సరిచేసుకోవడానికి ఉపాధి పనులను వదిలి రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. ఇలా చిన్న చిన్న తప్పుల కారణంగా అర్హులైన వారికి కూడా తల్లికి వందనం డబ్బులు జమ కాలేదు. ఇంటి పేరున ఎవరికో ఇన్‌కమ్ ట్యాక్స్ ఉందన్న నెపంతో అర్హుల జాబితాలో పేరు కనిపించకుండా పోయింది.

పూర్తి స్థాయి విచారణ చేపట్టకుండా..

ఏడాది కిందట నుంచి పథకాన్ని అమలు చేస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ముందుగానే అర్హుల జాబితా ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు. తల్లికి వందనం లిస్టు తయారు చేసే ముందు అధికారులు లబ్ధిదారుల విషయంలో పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండా నిర్లక్ష్యంగా పూర్తి చేయడంతో అర్హులైన వారు నేడు పలు రకాల తిప్పలు, ఇక్కట్లకు గురవుతున్నారు. మొదట అధికారులు సక్రమంగా విచారణ చేసి ఉంటే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం అయ్యేవి కావన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పనులను వదిలిపెట్టి పలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అర్హులమని సచివాలయం హెల్ఫేర్ అసిస్టెంట్లకు సర్టిఫికెట్స్ అందజేస్తున్నారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా వీరు అర్హులుగా చాలా మంది నమోదవుతున్నారు.

తప్పు చేసిన అధికారులపై చర్యలేవి?

మొదట అనర్హులుగా ఉన్న వారు వారి దిద్దుబాటుతో అర్హులుగా మారుతున్నారు. ఇలాంటి సమస్యలు ఎదురైన చోట ఉన్నత స్థాయి అధికారులు పర్యవేక్షించి గతంలో తప్పు చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తప్పు చేసిన అధికారులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉద్యోగుల్లో నిర్లక్ష్య భావం ఎక్కువ అవుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో చేపట్టే పథకాలు అధికారుల నిర్లక్ష్యంతో అర్హులకు అందకుండా పోతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు అర్హుల జాబితా తయారీ సమయంలోనే క్షుణ్ణంగా పరిశీలిస్తే అర్హులకు ఇలాంటి ఇబ్బందులు తప్పవని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా కూటమి పాలనలో సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇటు అధికారులు, అటు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

అరకొరగా అమలు

ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో భారీగా కోతలు విధించింది. అధికారులు చేసిన చిన్న తప్పులు అర్హుల పాలిట శాపంగా మారాయి. పథకం అమలులో ఎక్కడా రాజీలేదని ప్రభుత్వం చెబుతున్నా... క్షేత్ర స్థాయిలో చూస్తే పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. అర్హత కలిగిన పేదలు, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పథకం అందక దిక్కులు చూస్తున్నారు. ఒకానొక దశలో గత పాలనలో ఇచ్చిన హామీలు చేయకుండానే చేతులెత్తేసిన విధంగానే.. ఈ పాలనలో కూడా మాటలతో కాలం వెల్లదీయాలన్న ఆలోచనలకు ప్రతిపక్షం, ప్రజలు గట్టిగా తిరగబడటంతో విధి లేని పరిస్థితులలో అరకొర పథకాలను అమలు చేసి చేతులు దులుపుకొనే ప్రయత్నానికి ఒడిగట్టిందన్న విమర్శలు ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీ, ప్రజల వ్యతిరేకతను భరించలేక తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమైంది.

ఎందుకు రాలేదని.. అడిగితే దాడి

కొత్త నిబంధనలు, అధికారులు చేసిన చిన్న చిన్న తప్పులు పథకాలకు ప్రజలను దూరం చేస్తోంది. ఇందులో భాగంగానే తల్లికి వందనంలో తల్లులకు తిప్పలు తప్పడం లేదు. జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి, పెంచిన కరెంట్ బిల్లులు తగ్గించుకునేందుకు పిల్లల తల్లిదండ్రులు సచివాలయాలు, విద్యుత్, రెవెన్యూ, విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొంత మంది అధికారులు, సిబ్బంది పైసలు ఇవ్వందే పనులు పూర్తి చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కూడా ఇదే అదునుగా భావించి పథకాల అమలులో సంఖ్య ఎంత తగ్గితే అంత మంచిదన్న భావనలో ఉంది. తల్లికి వందనం డబ్బులు విషయంపై అడగడానికి వెళ్లిన తల్లిదండ్రుల పైన బి.కొత్తకోట మండల పరిధిలో సచివాలయ వెల్ఫేర్ అధికారి దాడి చేసిన సంఘటన కూడా జిల్లాలో సంచలనం రేపింది. ఈ దాడి వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



దాడిలో గాయపడిన నాగభూషణం, అనురాధ (ఫైల్)

దివ్యాంగులకూ అందని దైన్యం



ఈమె పేరు తూగు రమాదేవి. కురబలకోట మండలంలోని ఆంగళ్లు గ్రామం మొలకవారిపల్లె. ఈమె వికలాంగురాలు. చందన ఒక్కటే కుమార్తె. స్థానిక మొలకవారిపల్లె ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. తల్లికి వందనం రూ. 13 వేలు జమ అయి ఉంటుందని బ్యాంకుకు వెళ్లారు. ఇంత వరకు జమ కాలేదు. వీరికి సెంటు భూమి కూడా లేదు. ఏళ్లుగా బాడుగ ఇంటిలో కాలం వెల్లదీస్తున్నారు. వీరి కంటే ఆ ఊరిలో పేదవారు లేరు. ఈమె భర్త సాధారణ కూలీ. ఆపై ఇతను కూడా వికలాంగుడే. తల్లికి వందనంకు అన్ని అర్హతలు ఉన్నా బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ కాకపోవడం విచిత్రంగా ఉంది. మన మిత్ర యాప్‌లో పరిశీలిస్తే ఈ పథకానికి అర్హులు కాదు అని వస్తోంది. అధికారులను అడిగితే తగిన స్పందన లేదు. ఇంటిలో ఎంత మంది పిల్లలున్నా ఇస్తామన్నారు. ఈమె వరకు చూస్తే ఉన్న ఒక్కరికి కూడా తల్లికి వందనం జమ కాలేదు. దీన్ని బట్టి ఈ పథకం ఎలా అమలు అవుతోందో అర్థం చేసుకోవచ్చని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది.

సుమో అమ్మినా ఉన్నట్లుగా చూపించారు



నా పేరు నజ్మా, మదనపల్లె పట్టణం చంద్రకాలనీ. నా భర్త మన్సూర్ అలీఖాన్. డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మాది మధ్య తరగతి కుటుంబం. మాకు ఒక పాప, బాబు. పాప ఫర్హాజాన్. రెండో తరగతి చదువుతుంది. తల్లికి వందనం వస్తుందనే ఆశతో ప్రైవేటు స్కూలులో చేర్పించాం. తల్లికి వందనం లిస్టులో అనర్హత ఉందని వచ్చింది. మాకు రెండేళ్ల క్రితం సుమో ఉండేది. బాడుగలు సరిగా రాపోవడంతో అమ్మేశాం. ఈ విషయం తెలియజేసినా ఫోర్‌వీలర్ ఉందని వచ్చింది. సుమో లేదని చెప్పినా ఇలా చేశారు. ఇప్పుడు స్కూలులో ఫీజు కట్టమంటున్నారు. తల్లికి వందనం వస్తుందనుకుంటే ఇలా చేశారు.

భూమి లేకున్నా... ఉన్నట్లుగా..

నా పేరు అవటాల సుగుణమ్మ, మాది రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ. నా పేరున ఒక సెంటు భూమి లేదు. నా కుమారుడు రాయచోటిలో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం నుంచి తల్లికి వందనం పథకానికి అనర్హుల జాబితాలో పేరు ఇచ్చారు. ఇదేమని తెలుసుకోవడానికి సచివాలయానికి వెళితే తన పేరున పది ఎకరాల భూమి ఉందని చెబుతున్నారు. పథకం డబ్బులు ఇవ్వకపోయినా ఫర్వాలేదు. నా పేరున ఉన్న పది ఎకరాల ఆస్తి ఎక్కడ ఉందో చూపిస్తే నేను అక్కడికి వెళ్లి వ్యవసాయం చేసుకుంటానని అడిగితే అధికారుల నుంచి సమాధానం లేదు. ఇదే విషయంపై రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినా న్యాయం జరగలేదు.

ఒక పిల్లోడికి పడింది.. ఇంకో పిల్లోడికి పడలేదు



నాపేరు మొక్కపల్లి కృష్ణమ్మ. మాది రాజంపేట. నాకు ఇద్దరు కొడుకులు. అయితే పదో తరగతి చదువుతున్న నా చిన్నకొడుకు సత్తయ్యకు తల్లికి వందనం పడింది. ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న రెడ్డయ్యకు పడలేదంట. మాకు తెలిసిన ఆయన సెల్‌ఫోన్‌లో చూసి చిన్నోడికి వచ్చినట్లు ఉంది, పెద్దోడికి రానట్లు ఉంది అని చెప్పినాడు. ఒక పిల్లోడికి వచ్చి, ఇంకో పిల్లోడికి రాకపోవడం అన్యాయం కదా సారు. జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి ఒకేసారి ఇద్దరు పిల్లోళ్ళకు డబ్బులు పడేవి. మేము రజకులం. మా ఇంటాయన చనిపోయాడు. నేను రజక వృత్తి చేసుకొని పిల్లోళ్లను చదివించుకుంటూ కట్టం మీద బతుకుతున్నాము. ప్రభుత్వం చెప్పినట్లు ఎంతమంది ఉంటే అంత మందికి తల్లికివందనం డబ్బులు వేయాలి.

సీఎంఏలో 44వ ర్యాంకు



ఢిల్లీలో ర్యాంక్ పత్రం అందుకుంటున్న వెంకటరమణ

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధి అనంతపురం పంచాయతీలోని గుడ్లవారిపల్లికి చెందిన గూడె వెంకటరమణ సీఎంఏలో ఆల్ ఇండియా కోటాలో 44వ ర్యాంకు సాధించారు. ఈ విద్యార్థి మంగళవారం ఢిల్లీలో గోల్డ్ మెడల్ అందుకున్నారు. వెంకటరమణ నిరుపేద కుటుంబంలో పుట్టారు. ఐదో తరగతి వరకు లక్కిరెడ్డిపల్లి విశ్వభారతి హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి వరకు, ఇంటర్ గుంటూరు మాస్టర్ మైండ్ కళాశాలలో చదివారు. ఉత్తమ ర్యాంకు సాధించేందుకు తల్లిదండ్రులు సహదేవరెడ్డి, రెడ్డమ్మ, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదని ఆయన అన్నారు. వెంకటరమణ దేశ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

4 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



నందలూరులోని సౌమ్యనాథస్వామి ఆలయం

నందలూరు: జిల్లాలో అత్యంత ప్రాశస్త్యం పొందిన ఆలయాలలో ఒకటైన సౌమ్యనాథ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు జూలై 4 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీ వరకు 10 రోజుల పాటు వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. 4న ఉదయం తిరుమంజనం, రాత్రి అంకురార్పణ, 5న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాళివాహనం, 6న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, 7న ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహవాహనం, 8న ఉదయం పల్లకీసేవ, రాత్రి హనుమంతు వాహనం, 9న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 10న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయని తెలిపారు. 11న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 12న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 13న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

ఉచితంగా న్యాయ సాయం



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్

రాయచోటి: కోర్టుల ద్వారా అందుతున్న ఉచిత న్యాయ సహాయాన్ని పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ, వైఎస్సార్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం రాయచోటి సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్, జైలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత, జైలు లోపల ఖైదీల హక్కులను తెలియజేశారు. ఉచిత న్యాయ సాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై వివరించారు. కార్యక్రమంలో రాయచోటి సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.

మట్టికొట్టుకుపోవద్దు!

- దేవునికడప చెరువులో జోరుగా తవ్వకాలు
- మట్టిని తరలించవద్దని దేవుని కడపలో స్థానికుల ఆందోళన



టిప్పర్ వాహనదారుడిని నిలదీస్తున్న స్థానిక మహిళ



దేవునికడప చెరువు కట్టపై ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

కడప అగ్రికల్చర్: రోజంతా టిప్పర్ల శబ్దాలే.. రోడ్డంతా గుంతలే.. ఇళ్లంతా దుమ్మూ ధూళే.. వీళ్ల పోరుకు సస్తాన్నాం.. అంటూ దేవునికడప వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవుని కడపలో చెరువు మట్టిని తరలించొద్దని మంగళవారం ఆందోళన చేశారు. ట్రాక్టర్లతో కాకుండా భారీ వాహనాలతో మట్టిని తరలిస్తున్నారని అలా తరలించ వద్దని రోడ్డుపై అడ్డంగా నిలబడి నిరసన చేపట్టారు. నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు.

మట్టి తరలింపు వాహనల రాకపోకల కారణంగా పాతకడప నుంచి వాటర్ గండికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. భారీ వాహనాలతో మట్టిని తరలించడం వల్ల రోడ్లన్నీ గుంతలు పడటంతోపాటు దుమ్ముధూళంతా ఇళ్లలోకి వస్తోందని స్థానికులు వాపోయారు. దీంతోపాటు దుమ్ముకు దగ్గు, ఆయాసం వస్తోందని బాధ వ్యక్తం చేశారు. వాహనాల తాకిడి, శబ్దాలతో ఇళ్లలో ఉండలేక పోతున్నామని చెప్పారు. వాహనాల తాకిడికి పిల్లలు పాఠశాలకు పంపాలంటే భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలతో తమ పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని వాపోయారు. దీంతోపాటు ముసిలి, పెద్దవాళ్లు రోడ్ల పైన తిరగలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం 20 రోజులుగా జరుగుతోందని, దీన్ని పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భారీ వాహనాలు నిత్యం ఆలయం మీదుగానే అధిక సంఖ్యలో వెళ్లుతుండటంతో భక్తులకు ఎంతో అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.

పొలాలకు కాదు వెంచర్లకు..

దేవుని కడప మట్టిని పొలాలకు అని చెప్పి అధికారుల వద్ద అనుమతి తోసుకుని వెంచర్లకు తరలిస్తూ వేలకు వేలు దండుకుంటూ వ్యాపారం చేస్తున్నారని స్థానికులు వాపోయారు. అది కూడా ట్రాక్టర్లతో తొలుకుంటామని అనుమతులు తీసుకుని భారీ టిప్పర్లతో రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తూర్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుమట్టి తరలింపును ఆపకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరించారు. స్థానికుల ఆందోళనకు ఎస్ఎఫ్‌యూఐ నాయకులు మద్దతిచ్చారు.

ఉపాధి పనుల తనిఖీ



పనులను తనిఖీ చేస్తున్న పీడీ వెంకటరత్నం

సంబేపల్లె: మండల పరిధిలోని గుట్టపల్లె, ఎస్.సోమవరం గ్రామాల్లో మంగళవారం పీడీ వెంకటరత్నం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న నీటి నిల్వ గుంతలు, హార్టికల్చర్, పిట్టింగ్ తదితర పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో బిల్లులు తదితర వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు బైకులు ఢీ


తీవ్రంగా గాయపడిన ప్రకాష్

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని కడప–చెన్నై జాతీయ రహదారిలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా, మంత్రాలయం నుండి కడప వైపు వెళ్తున్న ఏపీ40హెచ్5631 నెంబరుగల బైకు ఒంటిమిట్టలోని కోదండరామస్వామి కల్యాణ వేదిక మొదటి గేటు వద్ద ఉన్న కడప–చెన్నై జాతీయ రహదారి దగ్గరకు రాగానే కల్యాణ వేదిక ఎదురుగా పంచర్ షాపు నుండి ఏపీ 40బిఒ6680 నెంబరుగల బైకు అకస్మాత్తుగా రావడంతో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో మంత్రాలయానికి చెందిన సంపత్, ప్రకాష్ (24) అనే ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది గాయపడిన వారిని అదే వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ గాయపడిన వారిలో సంపత్ రిమ్స్ నుంచి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడని, కానీ అక్కడ ఉన్న ప్రకాష్ పరిస్థితి కాస్త విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

కుటుంబ సమస్యలతో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన బాలాజీ భార్య శ్రీదేవి (28) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగింది. ఆమె భర్త మూడేళ్ల క్రితం మృతి చెందగా ఇద్దరు పిల్లలతో కలిసి అత్తవారి ఇంట్లో ఉంటోంది. అత్తతో మనస్పర్థలు ఏర్పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ గోవర్ధన్ నగర్‌కు చెందిన నాయక్ భార్య లక్ష్మి (30) కుటుంబ సమస్యల కారణంగా సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుంది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీదేవిని తిరుపతికి రెఫర్ చేయగా, లక్ష్మిని కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సృజన ఆత్మహత్యకు కారణాలు వెల్లడించాలి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టవాండ్లపల్లెకు చెందిన సృజన ఆత్మహత్యకు గల కారణాలు పోలీసులు వెల్లడించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామాంజులు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్


గొల్లపల్లె సెక్షన్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజిలోని గొల్లపల్లె సెక్షన్‌లోని సమస్యాత్మక ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం రేంజర్ మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం ఫారెస్టు రేంజి పరిధిలోని గొల్లపల్లె, రోళ్లబోడు, ఫారెస్టు బీట్లలో సమస్యాత్మక ప్రదేశాల్లో ఎర్రచందనం స్మగ్లర్ల కోసం సోమవారం నుంచి కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతాల్లోని సమీప గ్రామాల్లో ప్రజలకు ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనబడితే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఓబులేసు, ఫారెస్టు బీటు ఆఫీసర్లు మధు, ఆది విశ్వనాథ్, పెంచల్‌రెడ్డి, అసిస్టెంటు బీటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

ఓబులవారిపల్లె : వై.కోట చెరువు అలుగు వద్ద మంగళవారం ఎర్రచందనం దుంగలను కారులోకి ఎక్కిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పక్కా సమాచారంతో చెరువు అలుగు సమీపానికి చేరుకోగానే అక్కడ కారులోకి ఎర్రచందనం దుంగలు మోస్తూ ఏడుగురు తారసపడ్డారని తెలిపారు. తమను చూడగానే రాళ్లతో దాడి చేసేందుకు ప్రయత్నించారన్నారు. తాము చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారివద్ద నుంచి ఒక కారు, నాలుగు ఎర్రచందనం దుంగలు, ఆరు మొబైల్ ఫోన్‌లు, ఐదు గొడ్డళ్లు, ఒక రంపం, మూడు టార్చిలైట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులు తిరుపతికి చెందిన కారు డ్రైవర్ ముత్యాల వెంకటేష్‌తోపాటు ఆరుగురు తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎర్రచందనం కూలీలు ఉన్నారని తెలిపారు. ఈ ఎర్రచందనం అక్రమ రవాణాకు సూత్రధారులైన ముగ్గురు స్మగ్లర్లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్టు అయిన ఏడుగురిని తిరుపతి ఎర్రచందనం కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండుకు తరలించామని వివరించారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన నేతలు


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, శివరామ్


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎన్ఆర్ఐలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్, వైఎస్సార్ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు ఎన్. శివరామ్ కలిశారు. మంగళవారం విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పలు విషయాలను వివరించారు. ముఖ్యంగా జిల్లా బీసీ విభాగం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్‌లో రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం జిల్లా పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జిల్లా బీసీ విభాగం ఎలా పనిచేస్తుందో విధి విధానాల గురించి వివరించారు. దీనిపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందిస్తూ మీలాంటి వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎన్ఆర్ఐలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గల్ఫ్ ఎన్ఆర్ఐలు కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వారు ఆయనను కలిసి ప్రవాసాంధ్రుల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఉన్న మన తెలుగువారు జాగ్రత్తలు తీసుకోవాలని, భారత ప్రభుత్వ ఆదేశాలను అనుసరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ద్వారా సందేశం ఇవ్వాలని వారికి సూచించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ ఏ. సాంబశివారెడ్డి, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, కువైట్ ఐటీ ఇన్‌చార్జి షేక్ అఫ్సర్ అలీ, బీసీ సభ్యుడు నరసింహ యాదవ్, మైనార్టీ సభ్యుడు షేక్ నాసర్, ఖతార్ మైనార్టీ ఇన్‌చార్జి షేక్ దర్బార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం తగదు

- జులై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం
- నిరసన ప్రదర్శనలో ఎల్ఐసీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి


నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ జులై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట దేశవ్యాప్త పిలుపు మేరకు జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమం మరోమారు చేపట్టనుందని, దీనిని ప్రతిఘటిస్తున్నామన్నారు. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని ఆయన కోరారు. 3,4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ తక్షణం చేపట్టాలన్నారు. దేశంలో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ విధానానికి స్వస్తి పలికి పాత పెన్షన్ విధానాన్ని అమలుకు సిద్ధపడుతున్నాయని, ఎల్ఐసీలో కూడా అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ నేతలు వసుప్రద, వారిజాతమ్మ, కేసీఎస్ రాజు, అమీనా పర్వీన్, రత్న కిషోర్, శ్రీవాణి, శశికళ, కుమార్, రఘు, చిన్నయ్య, గౌస్, హనుమ తదితరులు పాల్గొన్నారు.

అతిగారిపల్లిలో వినాయక విగ్రహం అపహరణ


చోరీకి గురైన వినాయక స్వామి విగ్రహం (ఫైల్)

పెనగలూరు : మండలంలోని అతిగారిపల్లి బీసీ కాలనీ వద్ద పురాతన కాలం నాటి వినాయక విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. బీసీ కాలనీ ఇంగ్లీషు మీడియం స్కూల్ మధ్యలో ఈ వినాయక విగ్రహం పురాతన కాలం నాటిదన్నారు. రోజూ భక్తులు అక్కడ పూజలు చేసేవారని తెలిపారు. త్వరలో ఇక్కడ ఆలయాన్ని నిర్మించాలని చందాలు కూడా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ తరుణంలో రాత్రి వేళలో విగ్రహాన్ని అపహరించారు. ఈ విగ్రహాన్ని జడవారిపల్లి రూటు వరకు ఈడ్చుకొని వెళ్లి అక్కడి నుంచి వాహనంలో తీసుకెళ్లినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ విగ్రహం చోరీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య


జయలక్ష్మి (ఫైల్)

సిద్దవటం : మండలంలోని మాధరవం–1 గ్రామ పంచాయతీ వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన నందం జయలక్ష్మి(27) అనే మహిళ మంగళవారం ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త నరసింహులు మాట్లాడుతూ తన భార్యకు మతిస్థిమితం లేదని కడప, తిరుపతి వైద్యశాలలో వైద్యం చేయించామన్నారు. తనకు ఐదేళ్ల కుమారుడు పెంచల్‌రామ్ ఉన్నాడని, ఈ అబ్బాయి తల్లిలేని బిడ్డగా మిగిలిపోయాడని బోరున విలపించాడు. ఈ విషయమై ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ మృతురాలి తండ్రి సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్థల వివాదంలో ఇరు వర్గాలపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఖాదర్‌బాద్‌లో స్థల వివాదానికి సంబంధించి సోమవారం రాత్రి జరిగిన ఘటనలో ఇరువర్గాలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్ ఖాదర్‌బాద్‌లోని తన స్థలంలో నిర్మాణాలను ప్రారంభించారు. అయితే కౌన్సిలర్ మునీర్ అహ్మద్ నిర్మాణాలపై అభ్యంతరం తెలిపాడు. దీంతో పోలీసుల సూచన మేరకు డాక్యుమెంట్ల ప్రకారం వెళ్లాలని ఇరువురు మాట్లాడుకున్నారు. అయితే సోమవారం రాత్రి తాను నిర్మించుకున్న ప్రహరీని కూలుస్తున్నారని తెలియడంతో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తన ముఖ్య అనుచరులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. అయితే అప్పటికే అక్కడ ఉన్న షరీఫ్, గౌస్, మునీర్ తమ్ముడు బషీర్ అహ్మద్, సుబ్రమణ్యంలతో పాటు మరి కొందరు వారిపై దాడి చేశారు. శేఖర్ యాదవ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రాజు తెలిపారు. తమ స్థలాన్ని ఆక్రమించుకొని గోడను కడుతున్నందున ఆపమని అడిగినందుకు తమపై దాడి చేశారని షరీఫ్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు శేఖర్ యాదవ్, సందీప్, హేమ కుమార్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ముందు జాగ్రత్త చర్యగా ఖాదర్‌బాద్‌లోని ఘటనా స్థలంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కాశినాయన : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వంటశాల, స్టోర్ రూంను ఆయన పరిశీలించారు. నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ప్రారంభమైనప్పటి నుంచి స్టాక్ రిజిస్టర్ రాయకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ బాబుకు మెమో ఇచ్చారు. అనంతరం నరసాపురం మోడల్‌పాఠశాలను తనిఖీ చేసి స్కూల్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు విద్యార్థులకు గుడ్లు ఇవ్వలేదని తెలుసుకుని ప్రిన్సిపాల్ సౌజన్యను ప్రశ్నించారు.

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో టిఫిన్ మెనూలో మార్పులు ఉంటాయన్నారు.

గురుకుల హాస్టల్ టెండర్లలో ఉద్రిక్తత

- కలెక్టరేట్‌లోనే బాహాబాహీకి యత్నం
- పోలీసు బందోబస్తు ఏర్పాటు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని గురుకుల పాఠశాల హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే టెండర్ల దాఖలు విషయంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కడప, వేంపల్లె, మైలవరం గురుకులాల హాస్టళ్లకు కోడిగుడ్లు, చికెన్, పాలు, కూరగాయలు, అరటిపండ్లు తదితర సరుకులు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. జాయింట్ కలెక్టర్ చాంబర్ వద్ద టెండరు బాక్సును ఏర్పాటు చేశారు. టెండర్ల దాఖలుకు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు తుది గడువు విధించారు. దీంతో అధికార పార్టీకి చెందిన మండల, గ్రామ స్థాయి నాయకులు టెండరు దాఖలు చేసేందుకు వచ్చారు. మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం వనిపెంటకు చెందిన కొందరు కడపకు సంబంధించి టెండరు దాఖలు చేసేందుకు వచ్చారు. దీనికి కమలాపురం ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకులు అడ్డు తగిలారు. తాము మైదుకూరు నియోజకవర్గానికి సంబంధించిన టెండర్లు దాఖలు చేయలేదు గనుక మీరు కూడా కడపకు సంబంధించి టెండరు వేయవద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరెవరి నియోజకవర్గాల పరిధిలో వారు టెండర్లు దాఖలు చేసుకోవాలంటూ సూచించారు. ఈ సందర్భంగా పరస్పరం తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. దాఖలైన టెండర్లను బుధవారం పరిశీలించనున్నారు.

బైకులు ఢీకొని వ్యక్తి మృతి

సుండుపల్లె : రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ చిన్నబిడికి గ్రామానికి చెందిన సుబ్బరామనాయక్ ద్విచక్రవాహనంలో సుండుపల్లె నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా బైపల్లె–బూడిదేటిపల్లె మార్గమధ్యంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో సుబ్బరామనాయక్ (60) అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై వెనుక కూర్చున్న వ్యక్తికిగా యాలయ్యాయి. కాగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి.

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించండి

- ఎంపీపీ స్థలానికే దిక్కు లేదు
- ఫేక్ డాక్యుమెంట్లపై ఐజీకి ఫిర్యాదు
- కొత్తపల్లె పంచాయతీలో విచ్చలవిడిగా భూ కబ్జాలు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్దేశ పూర్వకంగా తమపై విమర్శలు చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తమ పార్టీ అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా భూ ఆక్రమణలను, కబ్జాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆయన మంగళవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎంపీపీ శేఖర్ యాదవ్‌పై సోమవారం రాత్రి టీడీపీ వర్గీయులు దాడి చేశారన్నారు. సోమవారం రాత్రి ఎంపీపీ స్థలంలోని నిర్మాణాలను కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి అనుచరులు, టీడీపీ కౌన్సిలర్ మునీర్ జేసీబీతో పడగొట్టారన్నారు. గత కొద్ది రోజులుగా ఈ స్థలం తనదని శేఖర్ వద్దకు మునీర్ రాగా ఆయన నిజం నిగ్గు తేల్చాలని పోలీస్ స్టేషన్‌కు దాదాపు 10 మార్లు తిరిగారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వర్గీయులు కావడంతో పోలీసులు అధికార పార్టీకి తలొగ్గి నిజాలను బయటికి వెల్లడించలేదన్నారు. వాస్తవానికి రూ.500 స్టాంప్ పేపర్‌పై టీడీపీ వర్గీయులు చూపించిన డాక్యుమెంట్‌కు సంబంధించిన సర్వే నంబర్ 547 ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరం గ్రామ పొలానికి సంబంధించిందన్నారు. ఈ ఆధారాలు కూడా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో లేవని, కేవలం దొంగ సంతకాలు, సీళ్లు వేసి తయారు చేసిన వాటిని చూపుతున్నారన్నారు. ప్రొద్దుటూరులో నకిలీ స్టాంప్‌లు, దొంగ సంతకాలు వ్యాపారం జోరుగా సాగుతోందని తెలిపారు.

కొత్తపల్లె గ్రామ పంచాయతీలో విచ్చల విడిగా కబ్జాలు

కొత్తపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్ శివచంద్రారెడ్డి ఎన్నికైనప్పటి నుంచి విచ్చల విడిగా భూ కబ్జాలు, ఆక్రమణలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ ప్రభావం కారణంగానే అక్కడ అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ఒక ముఠా ఏర్పడి దొంగ సంతకాలు, నకిలీ స్టాంప్‌లు తయారు చేస్తోందన్నారు. ఈ విషయంపై విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీకి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ, సర్పంచ్ ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎన్నో భూ ఆక్రమణలను, కబ్జాలు జరిగాయని తెలిపారు. అవినీతి విచ్చల విడిగా పెరిగిపోయిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్, ఉప సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, ఎంపీటీసీ ఓబయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివ పాల్గొన్నారు.

ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లో కడప జట్టు ఘన విజయం


5 వికెట్లు తీసిన కడప బౌలర్ నాగ కుళ్లాయప్ప


4 వికెట్లు తీసిన కడప బౌలర్ చరణ్


106 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ మన్విత్‌రెడ్డి


170 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ తోషిత్ యాదవ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లో మంగళవారం మూడో రోజు కడప జట్టు చిత్తూరు జట్టుపై ఘన విజయం సాధించింది. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెండు వికెట్లు కోల్పోయి 12 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 30.4 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. దీంతో 329 పరుగులతో కడప జట్టు ఘన విజయం సాధించింది. చిత్తూరు జట్టులోని సోహన్‌రెడ్డి 47, సాయి చరణ్ 30 పరుగులు చేశారు. కడప జట్టులోని నాగకుళ్లాయప్ప 5 వికెట్లు, చరణ్ 4 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 399 పరుగులు చేయగా చిత్తూరు 97 పరుగులకు ఆలౌట్ అయింది. కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 169 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

డ్రాగా ముగిసిన నెల్లూరు–కర్నూలు మ్యాచ్

వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన నెల్లూరు–కర్నూలు మ్యాచ్ డ్రాగా ముగిసింది. మంగళవారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 78.2 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 415 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని తోషిత్ యాదవ్ 155 బంతుల్లో 170 పరుగులు, మన్విత్‌రెడ్డి 106 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని నౌషద్ కళ్యాణ్ 3 వికెట్లు, మల్లికార్జున 2 వికెట్లు, విఖ్యాత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 9 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 464 పరుగులు చేయగా కర్నూలు జట్టు 171 పరుగులకు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే.

డిప్లొమా ఫలితాలలో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ


డిప్లొమా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన సీబీఐటీ విద్యార్థులు

చాపాడు : స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల విడుదల చేసిన డిప్లొమా ఫస్టియర్, సెకెండియర్ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు డిప్లమో హెచ్ఓడీ జీ.రమేష్‌బాబు తెలిపారు. ఫస్టియర్ సీఎంఈలో ఎం.కళ్యాణి 98.30, ఎం.శ్రీవర్ని 94.20, బీఎస్.బీబీ ఖతీజా, పి.అజయ్‌కుమార్ 91.60, షేక్ బాబా రియాజ్ 90.90, సయ్యద్ లిక్షియా 90.50, ఈసీఈలో కె.పూర్ణ అక్షయ 98.27, ఎం.ఉషశ్రీ 94.72, బి.వెంకట అనూష 90.90, పి.లక్ష్మి సుజన 95.72, ఎస్.భవిత 94.54, పి.ఆదికేశవరెడ్డి 94.54, ఎస్‌కే సనాఅఫీఫా 93.90 శాతం మార్కులు సాధించారన్నారు. ఈఈఈలో షేక్. మహమ్మద్ జుబేర్ 95.70, బి.మహ్మద్ యాసిన్ 86 శాతం మార్కులు సాధించగా, సెకెండియర్ సీఎంఈలో జి.కీర్తితేజ 98.88, ఎం.వెంకటలక్ష్మి 95.44, జి.చంద్రిక 95.22, పి.గంగశ్రీజన 97.11, పి.స్నేహ 95.55, పి.అంజనీదేవి 93.77, ఈసీఈలో బి.లాస్య 98.90, కె.వెంకటస్వప్న 97.90, కె.జాహ్నవి 97.10, కె.మెహజాబి 98.90. పి.రమ్యశ్రీ 97.50, ఎస్.గురుశ్రావ్య పూజిత 95.80, ఎస్.రహిమున్నీస 95.80, ఈఈఈలో సి.మునికుమార్ 97.60, ఆర్.దినేష్‌రెడ్డి 96.00, ఎస్.లోకేష్ 92.30 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ కాలేజీ విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల కరస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, సీఈఓ వి.లోహిత్‌రెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శృతి, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

అనుమతి లేని వైద్యం

- స్పెషలైజేషన్ లేకున్నా 'రుమటాలజీ' వైద్యం
- ఓ ఆర్థో వైద్యురాలి నిర్వాకం

కడప రూరల్ : వైద్య వృత్తి పవిత్రమైంది. వారు దైవంతో సమానం. అయితే కొంతమంది వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తూ వృత్తికే కలంకం తెస్తున్నారు. కడప నగరం ఎర్రముక్కపల్లెలో ఒక ఆర్థోపెడిక్ వైద్యురాలు వైద్య నిబంధనలకు విరుద్ధంగా 'రుమటాలజీ' (కీళ్ల విభాగం) వైద్య సేవలు అందించడం చర్చనీయాంశంగా మారింది.

'స్పెషలైజేషన్' లేకుండానే..

వైద్య వృత్తి కోర్సు (ఎంబీబీఎస్) ఐదేళ్ల పాటు ఉంటుంది. అనంతరం వైద్య రంగానికి సంబంధించి ఏదైనా ప్రత్యేక విభాగాలకు చికిత్స అందించాలంటే మరో మూడేళ్ల పాటు ప్రత్యేక కోర్సును అభ్యసించాలి. ఆ కోర్సు పూర్తయిన వారికి 'స్పెషలైజేషన్' సర్టిఫికెట్ ఇస్తారు. నిబంధనల మేరకు ఈ సర్టిఫికెట్ పొందిన వారు ఆయా విభాగాలకు సంబంధించి స్పెషలిస్టు వైద్యులుగా ప్రకటించుకోవచ్చు. ఆ విభాగానికి వైద్య సేవలు అందించవచ్చు. అయితే ఆ వైద్యురాలు రుమటాలజీలో 'స్పెషలైజేషన్' సర్టిఫికెట్ పొందలేదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా 'అడ్వాన్స్ రుమటాలజీ అండ్ ఆర్థో ఆసుపత్రి' అని బోర్డు పెట్టారు. రుమటాలజీ విభాగానికి సంబంధించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ అంశంపై ఎవరో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం..

బోర్డును మార్చమని చెప్పాం: డీఎంహెచ్ఓ

ఈ అంశం గురించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజును వివరణ కోరగా ఆయన స్పందించారు. ఆ వైద్యురాలికి రూమటాలజీలో 'స్పెషలైజేషన్' లేదు. నేమ్ బోర్డ్‌ను మార్పు చేసి సాధారణ వైద్య సేవలు అందించమని చెప్పాం. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపాం' అని అన్నారు.

మారని నేమ్ బోర్డు..

డీఎంహెచ్ఓ చెప్పిన దాని ప్రకారం అయితే నేమ్ బోర్డు మారాలి. అయితే సోమవారం సాయంత్రం వరకు నేమ్ బోర్డ్‌లో ఎలాంటి మార్పు లేదు. కాగా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోనే ఉంటాయి. ఈ ఆసుపత్రులను తనిఖీలు చేపట్టి ధ్రువీకరణ, అనుమతి పత్రాలను ఆ శాఖే చూడాలి. ప్రైవేటు ఆసుపత్రులను పర్యవేక్షించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.